

ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న వినయ్‌భాస్కర్, నాయకులు

## కాంగ్రెస్ గూండాగిరీకి భయపడం

- దాడులకు ప్రతిదాడులు తప్పవు
- హామీలు అమలు చేయలేక బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులు
- హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్

హనుమకొండ, జనవరి 12: అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయాలని బీఆర్ఎస్ శ్రేణులు ప్రశ్నిస్తుంటే కాంగ్రెస్ నేతలు గుండాగిరి చేస్తూ దాడులకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. కాంగ్రెస్ దౌర్జన్యాలకు, తమ పార్టీ నేతలపై అక్రమ కేసులకు భయపడమని స్పష్టం చేశారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంపై కాంగ్రెస్ మూకల దాడిని ఖండిస్తున్నామన్నారు. చర్యకు ప్రతి చర్య ఉంటుందని, దాడులకు ప్రతి దాడులు తప్పవని ఆయన హెచ్చరించారు. పార్టీలు ఏవైనా, వాటి కార్యాలయాలు ఆయా పార్టీలకు పవిత్ర దేవాలయాలవంటివని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికలు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలు అన్నారు. ప్రజల తరపున బీఆర్ఎస్ పోరాడుతోందని, అందుకే పార్టీ కార్యాలయంపై దాడి చేశారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీలో 60 లక్షల మంది గులాబీ సైనికులున్నారని, కాంగ్రెస్ నేతలు దాడికి దిగితే తాము ప్రతి దాడి చేస్తామని స్పష్టం చేశారు. పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాకు శాంతియుత మార్గాన్ని సూచించారని, అదే మార్గంలో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించామన్నారు. మాకు పోరాటాలు, కేసులు కొత్త కాదని, ఎన్ని కేసులు పెట్టినా, దాడులు చేసినా భయపడమని వినయ్‌భాస్కర్ హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జోరిక రమేశ్, వరంగల్ పశ్చిమ ని యోజకవర్గ పార్టీ కో-ఆర్డినేటర్ పులి రజినీకాంత్, బీఆర్ఎస్వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్, నాయకులు రవీందర్‌రావు, ప బ్బో జు శ్రీకాంతాచారి, వీరస్వామి, పోలపల్లి రామ్మూర్తి, రఘు, పానుగంటి శ్రీధర్, పెద్ది రాజు, రఘు తదితరులు పాల్గొన్నారు.

- సర్కారు సొమ్ము లూటీ చేస్తున్న అధికారులు
- నిబంధనలు బేఖాతరు చేస్తూ అదనపు ఆదాయం
- కొందరు కార్లను వాడకుండానే డబ్బులు దండుకుంటున్న వైనం
- ప్రతి నెల రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు సంపాదన
- ములుగులో సార్లు తిరిగేందుకు సహకరిస్తున్న కిందిస్థాయి సిబ్బంది

# సొంత వాహనాలు.. అద్దె బిల్లులు




ములుగు, జనవరి12(నమస్తేతెలంగాణ): ములు గు జిల్లాలో కొందరు ప్రభుత్వ ఉద్యోగులు సొంత వాహనాలనే అద్దె వాహనాలుగా చూపిస్తూ సర్కారు సొమ్మును లూటీ చేస్తున్నారు. నిబంధనలు బేఖాతర్ చేస్తూ అదనపు ఆదాయాన్ని పొందేందుకు వక్రమార్గాలను ఎంచుకుంటున్నారు. ఉద్యోగులకు ప్రతి నెల వేతనంతో పాటు అధికారులకు వాహన సౌకర్యాన్ని కూడా అందిస్తున్నది. దీన్ని ఆసరాగా చేసుకుని కొం దరు తమ సొంత వాహనాలను అద్దెకిచ్చినట్లు చూ పుతూ కింది స్థాయి సిబ్బందిని డ్రైవర్లుగా నియమించుకొని వాహన అలవెన్స్‌ను పొందుతున్నారు. మరికొందరు తమ బంధువుల పేర్లపై వాహనాలను కొ నుగోలు చేసి తాము అద్దెకు తీసుకున్నట్లు చూపుతూ ప్రభుత్వ నిధుల నుంచి నెలకు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు దండుకుంటున్నారు. జిల్లాలో అన్ని శాఖల ఉన్నతాధికారులకు వాహన సౌకర్యం ప్రభుత్వం కల్పిస్తుండగా, ఇందులో 50 శాతం మేర సొంత వాహనాలనే అద్దెకు ఉపయోగిస్తున్నట్లు తెలుస్తున్నది. విద్యుత్, విద్య, వైద్యారోగ్య, డీఆర్‌డీఏ, సంక్షేమ శాఖలతో పాటు మరికొన్ని శాఖల్లో పనిచేస్తున్న అధికారులు అద్దె వాహనాల పేరుతో సొమ్ము చేసుకుంటున్నారు.

### అద్దె వాహనాలను వాడకుండానే బిల్లులు

కొన్ని శాఖల అధికారులు ప్రభుత్వం సమకూర్చిన అద్దె వాహనాలను తమ ఇంటి అవసరాలకు వాడుకుంటూ ప్రతి నెల బిల్లులను మాత్రం సర్కారు నుంచి పొందుతున్నారు. అధికారులు కార్యాలయానికి వచ్చి వెళ్లేందుకు, విధి నిర్వహణలో వివిధ ప్రాంతాల్లో పర్యటించేందుకు ఈ వాహనాలను ఉపయోగించాల్సి ఉంటుంది. ఇందుకు విరుద్ధంగా ములుగు డీఆర్‌డీఏలో పని చేస్తున్న డీపీఎంలు సొంత వాహనాలను అద్దెకు చూపిస్తూ వాటిని సైతం వినియోగించడం లేదు. కొందరు బస్సుల్లో, మరికొందరు ద్విచక్రవాహనాలపై విధులకు హాజరవుతున్నారు. కిందిస్థాయి ఉద్యోగుల్లో ఎవరికైనా వాహనం ఉంటే దానిలో వెళ్తున్నారు. ఓ డీపీఎం సీసీని మచ్చిక చేసుకొని బస్సు దిగిన అనంతరం అతని ద్విచక్రవాహనంపై గ్రామాల్లో పర్యటిస్తున్నాడు. దీన్ని ఆసరాగా చేసుకున్న సదరు సీసీ తన విధులను మరిచి సారు సేవలకు పరిమితమవుతున్నాడు. మరో ఇద్దరు డీపీఎంలు ములుగు నుంచి జాకారం వరకు ప్రతి రోజూ ద్విచక్రవాహనంపై వెళ్లి విధులకు హాజర వుతూ అద్దె కారు పేరు తో ఆదాయం పొందుతున్నారు. ప్రతి నెల క్రమం తప్పకుండా అద్దె వాహనాల పేరుతో కొందరు అధికారులు అలవెన్స్‌ల పేరుతో బిల్లులు తీసుకుంటున్నారు. ఉన్నతాధికారులు చర్యలు చేపడితే ఎంతో మంది నిరుద్యోగులు, వాహనదారులకు ఉపాధి కల్పించొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.




## తెలంగాణ క్రీడాకారుల సత్తా

జాతీయస్థాయి సెపక్‌తక్రాలో సెమీస్‌కు చేరిన అమ్మాయిలు

హనుమకొండ చౌరస్తా, జనవరి 12 : జాతీయస్థాయి సెపక్‌తక్రా పోటీల్లో తెలంగాణ క్రీడాకారులు సత్తా చాటారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియం (జేఎన్ఎస్)లో నాలుగు విభాగాల్లో (టీం, రెగ్యు, డబుల్, క్వాడ్) పోటీలు నిర్వహిస్తున్నారు. మూడో రోజైన ఆదివారం ఉమెన్ రెగ్యు ఈవెంట్‌లో తెలంగాణ క్రీడాకారులు కేరళ, ఢిల్లీ, గుజరాత్, జార్ఖండ్‌పై 0-2 పాయింట్లతో గెలుపొంది సెమీస్‌కు దూసుకెళ్లారు. ఇటు మెన్ రెగ్యు ఈవెంట్‌లో రాష్ట్ర క్రీడాకారులు హిమాచల్‌ప్రదేశ్, గోవా, ఒడిశా, కర్ణాటక రాష్ట్రాలపై 0-2 పాయింట్లతో గెలుపొందగా ఢిల్లీపై 2-0తో ఓటమి చెందారు. శాసన మండలి వైస్‌చైర్మన్ బండా ప్రకాశ్, సాంబారి సమ్మారావు, పల్లెబోయిన అశోక్ పాల్గొని క్రీడాకారులను అభినందించారు. డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్ నాయక్, తెలంగాణ సెపక్‌తక్రా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కానుగంటి సురేశ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రిక్కల శ్రీనివాస్‌రెడ్డి, లయన్ హనుమాండ్లరెడ్డి, డాక్టర్ ఎస్ఆర్ ప్రేమ్‌రాజ్, వైఎస్ దాయి, విజయభాస్కర్‌రెడ్డి, జీ సంజీవరెడ్డి, ఎం జగన్నాథస్వామి, కూనమల్ల జితేందర్ నాథ్, ఆర్‌వీ రామకృష్ణ, అయోధ్య, జీ ధన్‌రాజ్, జీ రవీందర్ పోటీలను పర్యవేక్షించారు.



సెపక్‌తక్రా రెగ్యు ఈవెంట్‌లో తలపడుతున్న క్రీడాకారులు






### కేయూ రెజ్లింగ్ టీం ఎంపిక



ఎంపికైన రెజ్లింగ్ టీంతో కార్యదర్శి వెంకయ్య

హనుమకొండ చౌరస్తా, జనవరి 12 : పంజాబ్ గురుకాశీ యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ రెజ్లింగ్ పోటీలకు కాకతీయ యూనివర్సిటీ జట్టును ఎంపిక చేసినట్లు స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ వెంకయ్య తెలిపారు. వీరిలో హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ నుంచి ఏ రాహుల్, హనుమకొండ వాగ్దేవి కాలేజీ నుంచి కే అఖిల్, జే మహేశ్, కిట్స్ కాలేజీ నుంచి మహ్మద్ ఇబ్రహీం, న్యూసైన్స్ కాలేజీ నుంచి ఎన్ కార్తీక్ ఉన్నారు. వీరికి వరంగల్ మాతృశ్రీ డిగ్రీ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ రాజు మేనేజర్‌గా వ్యవహరించనున్నారు.








పాకాల తూమువద్ద మట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

- బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే పాకాల, రంగాయ చెరువు ప్రాజెక్టులు పూర్తి
- రెండింటికి కలిపి 5 టీఎంసీలకు నీటి అనుమతులు
- పాకాల వాగుపై బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలి
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి
- దబ్బ వాగు వద్ద గోదావరి జలాలకు పూజలు

## అదనపు ఆయకట్టుకు సాగునీరందించాలి

ఖానాపురం, జనవరి 12 : పాకాల ప్రాజెక్టు కింద అదనపు ఆయకట్టుకు సాగునీరందించాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి దబీర్‌పేట శివారు దబ్బవాగు వద్ద గోదావరి జలాలకు, పాకాల కట్టమైసమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పెద్ది మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సీఎం కేసీఆర్, ఇరిగేషన్‌శాఖ మంత్రి హరీశ్‌రావు సహకారంతో పాకాల, రంగాయ చెరువు ప్రాజెక్టులను పూర్తిచేయించామన్నారు. ఎంతో కష్టపడి అధికారుల సమన్వయంతో సమ్మక్క సాగర్, భీంఘన్‌పూర్, రామప్ప నుంచి పాకాలకు గోదావరి జలాలను ప్రణాళికాబద్ధంగా తరలించామన్నారు. ఆనాటి సంకల్పం నెరవేరిందని, రైతులు రెండు పంటలు పండించుకుంటున్నారని తెలిపారు. పాకాల ప్రాజెక్టుకు రూపకల్పన చేసిన సమయంలోనే దబీర్‌పేట, చిలుకమ్మనగర్, మంగళవారిపేట గ్రామాల్లో అదనపు ఆయకట్టుకు నీరందించేందుకు అనుమతులు సాధించుకున్నామన్నారు. దబ్బవాగు వద్ద కూసుకుంట డైవర్షన్‌తో దబీర్‌పేట, సంగెం కాలువ ఎక్స్‌టెన్షన్‌తో మంగళవారిపేట, నాజీతండా, వేపచెట్టుతండా భూములకు నీరందించేలా డిజైన్ చేశామన్నారు. గత ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి అధికారం కట్టబెట్టినందున ప్రస్తుత ఎమ్మెల్యే వెంటనే అదనపు ఆయకట్టుకు సాగునీరందించే ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. పాకాల ప్రాజెక్టుకు 3, రంగాయ చెరువుకు 2 టీఎంసీలు, మొత్తం 5 టీఎంసీల నీటికి అనుమతులున్నాయని, వీటితో 60 వేల ఎకరాలకు సాగునీరందించవచ్చన్నారు. రైతుల శ్రేయస్సు దృష్ట్యా రాకపోకలకు అనుకూలంగా ఉంటుందనే ఉద్దేశ్యంతో పాకాల వాగుపై కొత్తూరు-చెన్నారావుపేట మధ్య, తిమ్మరాయినిపహాడ్ శివారులో, ధర్మారావుపేట జగ్గుతండా శివారులో బ్రిడ్జిల నిర్మాణానికి కోట్లాది రూపాయలతో గత ప్రభుత్వంలో అనుమతులు తీసుకొచ్చామని, టెండర్ల ప్రక్రియను సైతం పూర్తిచేశామన్నారు. కాని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాటిని రద్దు చేసిందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో తెచ్చినవన్నీ దొంగ జీవోలన్న కాంగ్రెస్ నాయకులు వాటితోనే కాంట్రాక్ట్ పనులు చేస్తుంటే ఎలా చెల్లుబాటవుతున్నాయని ప్రశ్నించారు. సాగునీటి రంగంలో డీబీఎం 38, 40, 48ల కింద 278 చెరువులు నింపే ప్రక్రియ చేపట్టామని, దానిపై దృష్టి పెట్టాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిలిచిపోయిన బ్రిడ్జిల నిర్మాణం వెంటనే చేపట్టాలన్నారు. సన్న ధాన్యానికి బోనస్ బో గస్‌గా మారిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రగల్భాలు పలుకుతున్నదని, ఎన్నికలు కాగానే పథకాలన్నీ నిర్వీర్యమైపోతాయని పెద్ది అన్నారు. కార్యక్రమంలో ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోత్ రామస్వామినాయక్, మాజీ ఎంపీపీ వే ములపల్లి ప్రకాశ్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు మహాలక్ష్మీ వెంకటనర్సయ్య, వేజళ్ల కిషన్‌రావు, ఇర్కు దేవేందర్‌రావు, కవిత, మస్తాన్, రాంబాబు, ఆబోతు అశోక్, కాస ప్రవీణ్‌కుమార్, రాజు యాదవ్ పాల్గొన్నారు.









## ముమ్మరంగా మిర్చి కోతలు

వాజేడు, జనవరి 11: ములుగు జిల్లా వాజేడు మండలంలో ముమ్మరంగా మిర్చికోతలు ప్రారంభమయ్యాయి. మిర్చి కోసి, వాటిని కల్లాల్లో ఆరబోసే కూలీలకు చేతినిండా పని దొరుకుతోంది. రోజు కూలి సైతం రూ. 300 వస్తుండడంతో ఈ పనులకు ఆసక్తి చూపుతున్నారు. వాజేడు, గుమ్మడిదొడ్డి, సుందరయ్య కాలనీ, చంద్రుపట్ల, అయ్యవారిపేట, ధర్మవరం, పేరూరు, పెద్ద గొల్లగూడెం, చింతూరు, కృష్ణాపురం, టేకులగూడెం తదితర గ్రామాల్లోని గోదావరి పరీవాహక ప్రాంతాల్లో పదివేల ఎకరాల్లో రైతులు మిర్చి సాగు చేస్తున్నారు. అయితే గతేడాది క్వింటా మిర్చి క్వాలిటీని బట్టి రూ. 22 వేల వరకు ధర పలికినప్పటికీ ఈ సారి బహుళ జాతి ఒప్పంద సంస్థ క్వింటాకు రూ. 12 వేలు మాత్రమే ఇస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. పెట్టుబడి పెరిగి ధర తగ్గడంతో వారు దిగులు పడుతున్నారు.



కల్లంలో ఆరబెట్టిన పండు మిర్చి












- రాత్రి వేళ లో జోరుగా మట్టి దందా
- ఆ భూమిని పొలాలుగా మార్చిన కొందరు రైతులు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు

## పెద్దబోడు గుట్టకు ఎసరు!

నల్లబెల్లి, జనవరి 12: వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం నాగరాజుపల్లె గ్రామ పంచాయతీ పరిధి గోవిందాపూర్ గ్రామ సమీపంలోని సర్వే నంబర్ 31లోగల పెద్దబోడు గుట్టకు కొందరు ఎసరు పెడుతున్నారు. ఈ గుట్టకు సంబంధించిన పదెకరాల భూమి ప్రభుత్వ భూమిగా రెవెన్యూ రికార్డుల్లో ఉంది. ఈ భూమిలో కొంత మంది మట్టి వ్యాపారులు రాత్రి వేళ జేసీబీలతో మట్టిని తవ్వి ఒక్కో టిప్పర్‌కు రూ.7 వేలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మట్టిని తొలగించిన స్థలాన్ని కొందరు రైతులు పొలం మడులుగా తయారు చేసి యాసంగి వరి నాట్లు వేశారు. అ లాగే మరికొంత మంది భూమిని సేద్యానికి సిద్ధం చేస్తున్నారు. గుట్టను విధ్వంసం చేస్తున్నా రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కలెక్టర్ స్పందించి ఆక్రమణకు గురవుతున్న పెద్దబోడు గుట్ట భూములను సర్వే చేపట్టి రక్షించాలని ఏజెన్సీ గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

### సర్వే చేసి హద్దులు నిర్ణయిస్తాం



ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పాల్పడుతున్న వారిని ఉపేక్షించబోం. పెద్దబోడు గుట్టను విధ్వంసం చేస్తూ మట్టిని తరలిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకుంటాం. అలాగే ఈ భూమిని సర్వే చేసి హద్దులు నిర్ణయిస్తాం. అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి విక్రయాలు చేపడితే వాహనాలను సీజ్ చేస్తాం.

– ముప్పు కృష్ణ, తహసీల్దార్, నల్లబెల్లి





